# స్వాతంత్ర్య స్వరూపం

ఒకప్పుడు, ఒకపిల్లదేశం ఇంకో పెద్దదేశం నించి నానా అవస్థలు పడి స్వతంత్రం సంపాయించింది. ఆ పిల్లదేశంలో ప్రజలు స్వతంత్రం వొచ్చినందుకు గుర్తుగా ఓ స్వతంత్ర విగ్రహం చేయించి రాజధాని నగరంలో ప్రతిష్ఠించుదామని తమ స్వతంత్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసారు. ప్రభుత్వంకూడా తమ ప్రజల ఆలోచన బాగానేవుందని వప్పుకుని, ఒక శిల్పిని పిలిపించింది. ఆశిల్పి అఖండమైన కళోపాసకుడు. అదివరకు చాలా విగ్రహాలు చేశాడు, అతను చేసిన విగ్రహాలు జీవకళ వుట్టిపడుతూ ఉండేవి. ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం ఆ శిల్పి ఒక సుముహూర్తంలో, మంచి చలువరాయితో విగ్రహం చేసేందుకు వుపక్రమించాడు.

స్వతంత్రాన్ని ప్రజలు పోరాడి తెచ్చుకున్నారు గనుక, స్వతంత్ర విగ్రహం, తమ పోరాటాల చరిత్రని ఎల్లప్పుడూ జ్ఞప్తిచేస్తో, తమ సుఖవంతమైన స్వతంత్ర భవిష్యత్తును చూపుతూవుండే ఒక మహావీరుని విగ్రహంగా చెక్కమని వాళ్ళు శిల్పికి తీర్మానాలు చేసి పంపారు. శిల్పి అలాగే నని ఒక మహావీరుని విగ్రహం చెక్కడం ప్రారంభించాడు.

కాని మొదట్నుంచీ, సామాన్య ప్రజలు పోరాటాలు చేసి స్వతంత్రం సంపాయిస్తే, తమ ప్రాబల్యం ఎట్లాగు మంటగలుస్తుందని భయపడుతూ వచ్చిన డబ్బు స్వాములు, తమ మీద అధికారం చెలాయిస్తున్న పరాయి దేశం డబ్బుస్వాములతో గుసగుసలూ, వికవికలూచేసి అధికారం తమ హస్తగతం చేసుకున్నారు. ఈ డబ్బుస్వాములు, ''స్వతంత్ర విగ్రహం, ప్రజలకి నూతనంగా వచ్చిన స్వతంత్ర ప్రభుత్వం యెడ నమ్రత, విధేయతా నేర్పే చిహ్నంగానూ, అల్లరీ ఆగం చేయకూడదని బోధించే గురువులాగూ ఉండాలి. అందుకని ఆ విగ్రహం ఓ ప్రశాంత తపస్విలాగానో లేక సన్యాసిలాగో వుండాలి'' అని శిల్పికి అజ్ఞాపించారు. శిల్పి ''చిత్తం'' అని మహావీరుడి విగ్రహం చెక్కినంతవరకు ఆపి, దాన్నే ఓ సన్యాసి రూపంలోకి చెక్కుతున్నాడు.

ఆ దేశంలోని డబ్బుస్వాముల్లోనే ఇంకా కొందరు మహాత్ములు, దేశాన్ని, దాని ఆర్థికపరిస్థితినీ తమ జేబుల్లోనూ, భోషాణాల్లోనూ ఇరికించుకొని వున్నారు. వాళ్ళకి ఈ సలహాలేవీ నచ్చలేదు. వాళ్ళందరూ కలిపి, ఆ విగ్రహం, మన విశాలమైన దేశం యొక్క స్వతంత్ర వ్యాపార ప్రతిపత్తిని విస్తరింపజేసేదిగా ఒక గొప్ప ఓడల వర్తకుని రూపంలో వుండాలి'' అని ఆ శిల్పికి ఆదేశం పంపారు. శిల్పి ఆ ఆదేశం వెనుక వుండే ఆర్థిక బలాన్ని వూహించుకొని ''అలాగే బాబు'' అని తను తయారుచేస్తోన్న సన్యాసి విగ్రహాన్నే ఓ గొప్ప వ్యాపారస్థుడి విగ్రహంగా మారుస్తున్నాడు.

కాని అసలు ప్రభుత్వంలో వుండే ప్రముఖులు ఇవన్నీ పనికిరావని రెండు మూడు సబ్ కమిటీలూ,

నాలుగైదు సంఘాలువేసి, వాటి రిపోర్టులన్నీ కలేసి చదివి, వాటినన్నిటినీ తీసేసింతర్వాత ''స్వతంత్రవిగ్రహం ప్రభుత్వం ఎడ భక్తినీ, నమ్రతనీ నేర్పేట్టు వుండవలసిందేకాని అది సన్యాసిలాగు ప్రజలకి ప్రభుత్వం యెడల భయమూ, భక్తినీ, శ్రద్ధా, గౌరవాల్నీ నేర్పే సాయుధ సైనికుడి విగ్రహంగా వుండాలని ప్రభుత్వం భావిస్తోంది. నిజమైన ప్రజాశాంతినీ, ప్రజాస్వామికాన్ని కాపాడేది ప్రభుత్వసైన్యమే. అదీకాకుండా ప్రజలలో కొందరు ఎల్లప్పుడూ ఆకలనీ, గుడ్డలనీ అల్లర్లుచేస్తో ఆర్థిక సమానత్వం అని లేనిపోని ప్రచారంచేస్తో, ప్రజల ప్రశాంత జీవితాలని భగ్నంచేస్తున్నారు. అటువంటి వాళ్ళకి స్వతంత్ర ప్రభుత్వంలోనైనా వాళ్ళ ఆటలు సాగవని హెచ్చరికలు తెల్పుతూ స్వతంత్ర విగ్రహం ప్రభుత్వసాయుధ సైనికుడి రూపంలో వుండాలి'' అని బహిరంగ ప్రకటన ఒకటిచేసి, శిల్పికి హుకుం ఇచ్చారు, సైనికుడి విగ్రహం చెక్కమని ''అట్లానే'' అని శిల్పి తను ఇదివరిలో చెక్కుతున్న వర్తకుడి రూపాన్నే సాయుధ సైనికుని రూపంలోకి మార్చుతున్నాడు. ప్రభుత్వం సలహాని డబ్బుస్వాములు హర్షించారు, వ్యాపారస్తులు ఆహ్వానించారు. అటూ ఇటూ మాట్లాడే పెద్దమనుషులు ఆమోదించారు, ప్రజలు మాత్రం ప్రభుత్వధోరణికి ముక్కుమీద వేలేసుకున్నారు.

అయితే శిల్పి మాత్రం ఎడతెరిపి లేకుండా శ్రమించి స్వాతంత్ర విగ్రహాన్ని తయారుచేశాడు. ఒక సుదినమున స్వాతంత్ర విగ్రహాన్ని రాజధానినగరంలో ప్రతిష్ఠించడానికి తీసుకువచ్చారు. అదివరకే తయారైన శిలావేదికపై స్వతంత్ర విగ్రహాన్ని వుంచారు. ప్రభుత్వ అధ్యక్షుడు స్వతంత్రాన్ని గూర్చి ఒక మహోపన్యాసం జేసింతర్వాత స్వతంత్ర విగ్రహానికి వున్న మొఖమల్‌గుడ్డని తొలగించాడు. స్వాతంత్ర విగ్రహం ఆధునిక ఆయుధాలతో సాక్షాత్కరించింది. భయంకరమైన దయ్యం రూపంలో

*(జులై 1948, విశాలాంధ్ర)*